# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## గుంటూరు జిల్లా వార్తలు

3

ఆదివారం 1 సెప్టెంబరు 2024




కార్పొరేషన్ వద్ద వర్షపు నీటిలో బోటు నడిపి ఎన్ఎస్‌యుఐ కార్యకర్త నిరసన

గుంటూరు బొంగరాలబీడు పాత వెహికల్ షెడ్ రోడ్డులో వర్షపు నీరు

# ఊరే చెరువు.. గుండె బరువు

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వణికిపోయింది. ఊరూ వాడా ఏకం కాగా అడుగు బయట పెట్టటానికి జిల్లా వాసులు భయపడి పోయారు. పల్లెటూర్లలోని వాగులు వంకలు ఉగ్రరూపం దాల్చాయి. పట్టణాల్లోని మురుగు కాల్వలు రోడ్డెక్కటం తో నగరాలు నయాగరా జలపాతంలా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో రోడ్డు మీదకు వచ్చిన వాహన చోదకులకు ఏది దారో..ఏది మాయదారో అర్థం కాక చాలా ప్రమాదాలు జరిగాయి. ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న పంట పొలాలు వరుణిని ఏక ధాటికి పూర్తిగా నీట మునిగాయి. 2019- 2024 వరకు చెరువులు, కాల్వలు పటిష్ఠ పరచకపోవటంతో గండ్లు పడతాయమో అనే అనుమానాలు కలుగుతున్నాయి. కృష్ణమ్మ ఉగ్రరూపిణి కావడం తో ఏటిపట్టు గ్రామాల్లో కి నీరు తన్నుకొస్తుంది. ఇష్టానుసారంగా తవ్వేసిన ఇసుక తిన్నెలు వల్ల వరద అంచనా వేయడం కష్టం గా ఉండటంతో అచ్చంపేట, అమరావతి మండలాల్లో వరద నీరు ఊర్ల లోకి భారీ స్థాయిలో వచ్చి చేరుతుంది. వానకు గాలి కూడా తోడవ్వటం తో చాలా పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇల్లూ వాకిలి లేని నిరాశ్రయుల పరిస్థితి దయనీయంగా మారింది. వానకు తడుస్తూ, చలిలో వణుకుతూ అల్లాడిపోతున్నారు.అత్యవసర విభాగాలకు చెందిన ఉద్యోగులు కూడా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగించారు. పోలీసులు అహర్నిశలు శ్రమించి ప్రజల ను ముంపు ప్రాంతాల్లో కి వెళ్లకుండా నివారించడం తో ప్రాణ ప్రమాదాలు తప్పాయి.ముంపు ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించడం తో ముప్పు తప్పింది. మూడు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు సహాయక చర్యలు కోసం కార్యకర్తలను అప్రమత్తం చేశారు. భోజనాలకు ఇబ్బంది పడుతున్న వారికి ఆహారపు ప్యాకెట్లు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు,ఇతర ఉన్నతాధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ఆరంభించారు.



బ్యారేజ్ దిగువున మొదటి ప్రమాద హెచ్చరిక

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎలాంటి సాయం కోసమైన నెంబరు. 08632234014, 9849904013కి ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు నెంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు.

కృష్ణానదిలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రకాశం బ్యారేజ్ నుంచి 3 లక్షల 42 వేల 466 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 70 గేట్లను తెరిచి నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులి చింతల గేట్లు తెరుచుకొన్న దృష్ట్యా ఏ క్షణాన అయినా బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో 4 లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉండటంతో శనివారం అర్ధరాత్రికి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

## వాగులో కొట్టుకు పోయిన కారు

### ఇద్దరు చిన్నారుల సహా ఉపాధ్యాయుడి మృతి







పెదకాకాని, ఆగస్టు 31 : గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒక ఉపాధ్యాయు డు, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మంగళగిరి రూరల్ మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన నడింపల్లి రాఘవేంద్రరావు(40) అనే వ్యక్తి నంబూరు సమీపంలోని వివా స్కూల్లో మ్యాథమెటిక్స్ టీచర్‌గా పని చేస్తుంటారు. ఇటీవల ఆయన ఉప్పలపాడులో నివాసం ఉంటున్నాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా స్కూలుకి వెళ్లారు. అయితే భారీ వర్షం పడటంతో పాఠశాలకు సెలవిచ్చారు. ఈ క్రమంలో ఉప్పలపాడుకు చెందిన 4వ తరగతి చదువుతున్న కోడూరి మాన్విక్ (9), 2వ తరగతి చదువుతున్న పసుపులేటి సౌరిస్(8) తన కారులో ఎక్కించుకొని, స్కూల్ నుంచి బయలుదేరారు. ఇంటికి వచ్చే క్రమంలో ఉప్పలపాడు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీన్ని గమనించకుండా రాఘవేంద్ర కారును వేగంగా నడిపాడు. వరద ఉధృతికి కారు వాగులో కొట్టుకుపోయింది. అందులో ఉన్న ముగ్గురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పరామర్శించారు.

### కొండ రాయి పడి వృద్ధురాలి మృతి



మంగళగిరి కొత్తపేట ఒకటో వార్డు పరిధిలో కొండచరియ విరిగిపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రూకా నాగరత్నమ్మ (65) వంట గదిలో అన్నం వండుతున్న సమయంలో కొండ పైనుంచి భారీ బండరాయి దొర్లిప డడంతో నాగరత్నమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలరు నరేంద్ర (బాబీ), అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి కుటుంబానికి టీడీపీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటుందని భరోసా ఇచ్చారు. కాగా, మరో రెండు రోజులు వర్షాలు పడే సూచనలు వుండడంతో కొండ దిగువన వున్న ఇళ్లను అధికా రులు ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు. రెండవ వార్డులో ఆటోడ్రైవరుగా పనిచేస్తున్న కూనిశెట్టి దుర్గారావు నివాసం గోడ భారీ వర్షానికి కుప్పకూలింది.

- ఉమ్మడి జిల్లా నెత్తిన అల్పపీడనం
- జిల్లా అంతటా భారీ వర్షాలు
- ఎడతెరపిలేని వానతో జనజీవనం అస్తవ్యస్తం
- రోడ్లపై ప్రవహించిన వరద నీరు
- వాగు ప్రవాహంలో కారు
- కొట్టుకుపోయి ముగ్గురు మృతి
- కాజ టోల్‌ప్లాజా వద్ద భారీగా వరదనీరు
- పలు చోట్ల నిలిచిపోయిన ట్రాఫిక్
- పొంగి పొర్లుతున్న వాగులు.. వంకలు
- ముంపునకు గురైన పంటలు
- నీట మునిగిన అపార్టుమెంట్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల సెల్లార్లు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- జిల్లాలో పాఠశాలలకు సెలవు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు 18 గంటల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో నివాస ప్రాంతాలు జలమయమయ్యాయి. అవుట్‌ఫాల్ డ్రెయిన్లు పొంగి వీధుల్లోకి పొర్లడంతో రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి. వర్షానికి ఈదురుగాలి తోడు కావడంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగి ట్రాఫిక్ స్తంభించిపోయేలా చేశాయి. ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లా అధికారుల నివాసాల్లోకి వరదనీరు చేరింది. శివారు కాలనీల్లోకి మురుగునీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ రహదారిపై కాజా టోల్ ప్లాజా వద్ద వరదనీరు నడుం లోతు ఎత్తుకి చేరి ప్రవహించడంతో హైవే బ్లాక్ అయింది. ఆటోనగర్, పెదకాకాని పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో హైవేపై వాన నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుపడ్డారు. పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన వివా స్కూల్ ఉపాధ్యాయుడు రాఘ వేంద్రరావు, విద్యార్థులు కోడూరి మాణిక్(9), పసుపు లేటి శౌరీలు (9) ప్రయాణిస్తున్న కారు వాగు నీటి ఉధృతిలో కొట్టుకుపోవడం.. ముగ్గురు మృతి చెందడం వారి కుటుంబాల్లో విషాదం అలముకొన్నది. వట్టిచెరుకూరు మండలంలోని జెల్లివాగు ఉధృతంగా ప్రవహించడంతో తహసీల్దార్ కార్యాలయం నీట మునిగింది. వర్షానికి గుంటూరు నగరం తీవ్రంగా ప్రభావితం కావడంతో ఏడు చోట్ల సహాయక శిబిరాలను నగరపాలకసంస్థ ఏర్పాటు చేసింది. అక్కడే నిరాశ్రయులకు భోజన, వసతి సదుపా యాలను కల్పించారు. మంగళగిరిలో 279.5 మిల్లీ మీటర్లు, తుళ్లూరులో 224.5, తెనా లిలో 179, పొన్నూరులో 131, గుంటూరు పశ్చిమలో 112.5, తాడేపల్లిలో 97.75, ప్రత్తిపాడులో 78 మిల్లీమీటర్ల రికార్డు వర్షపాతం నమోదైంది. గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియం చెరువులా మారిపోవడంతో సమీపంలో నివసిస్తున్న పిల్లలు అందులో ప్రమాదకర రీతిలో జలకాలాడుతున్నారు.

### రైళ్ల రాకపోకలపై హెల్ప్‌లైన్ నంబర్లు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలపై రైల్వే శాఖ పలు రైల్వేస్టేషన్లలో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. గుంటూరు రైల్వేస్టేషన్‌లో 9701379072, నరసరావుపేటలో 9701379978, నడికుడిలో 7989875492, నల్గొండలో 9030330121, మిర్యాలగూడలో 8501978404, నంద్యాలలో 7702772080, దొనకొండలో 7093745898 నంబర్లను అందుబాటులో ఉంచింది.

**ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు**

వర్షాలతో కొండపల్లి వద్ద వరదనీరు పట్టాలపైకి చేరుకోవడంతో ట్రైన్ నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్ ప్రెస్‌ను నడికుడి మార్గంలో సికిం ద్రాబాద్‌కు నడిపారు.

### పలు రైళ్ళు రద్దు

వర్షం కారణంగా గుంటూరు మీదగా ప్రయాణించే నర్సాపూర్ - గుంటూరు, గుంటూరు-రేపల్లె, రేపల్లె - గుంటూరు, గుంటూరు - విజయవాడ రైళ్లను రెండో తేదీ వరకు రద్దు చేశారు. విజయవాడ - తెనాలి, తెనాలి - విజయవాడ, తెనాలి - రేపల్లె, రేపల్లె - తెనాలి రైళ్లను కూడా ముందుజాగ్రత్త చర్యగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ వర్షం కారణంగా 3.16 గంటల ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకొన్నది. దీంతో గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని రీషెడ్యూల్ చేశారు.

### మంత్రి నారా లోకేశ్ సమీక్ష

మంగళగిరి నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే లోకేశ్ ఎప్పటికప్పుడు అధికారు లతో సమీక్షించారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని వాకబు చేస్తూ సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశా రు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో తక్షణమే సాయం అందించాలని, ప్రజా జీవనానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టా లని ఆదేశించారు. వరద ప్రాంతాల ప్రజలకు ఆహారం, తాగునీరు అందించి, సహాయక చర్యల్లో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అవసరాన్ని బట్టి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం వరద సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఆత్మకూ రులో కాలువ కట్ట తెగి నిర్వాసితులైన వంద మందిని గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించారు. రత్నాల చెరువు, ఎస్టీ కాలనీ ఏరియాల్లో బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. నవులూరు పో తురాజు కట్ట పొంగి పొర్లడంతో జేసీబీ తో తూములను తొలగించే పనులు చేపట్టారు. పెదవడ్లపూడి మార్కెట్ యార్డు పక్కనే వున్న నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరడంతో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ ఆధ్వర్యంలో బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

### మంగళగిరిలో 264 మి.మీ వర్షపాతం

మంగళగిరి పట్టణంలో రెండు రోజుల్లో 264 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 110 మి.మీ వర్షపాతం నమోదు కాగా, శనివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 154.75 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కేంద్రంగా శనివారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జిల్లాలోనే అత్యధికంగా 279.5 మి.మీ వర్షపాతం నమోదైంది.



గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ లోపల వర్షపు నీరు



చుట్టుగుంటలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు



ఉమెన్స్ కాలేజ్ రోడ్డుపై వర్షపు నీటిలో వాహనదారుల ఇక్కట్లు



నీట మునిగిన గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ 1, 2 డిపోలు



గుంటూరులో నీట మునిగిన పెన్ లాక్ మార్కెట్



తెనాలి: వర్షపునీటిలో గురుకుల హాస్టల్ రూమ్‌లో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు




మంగళగిరి టిడ్కో సముదాయంలో ఇళ్లను చుట్టుముట్టిన వర్షపు నీరు





మంగళగిరి భార్గవపేటలోని గోలి వారి వీధిలో వరద ప్రవాహం



- కొల్లిపర మండలం అత్తోటలో నీటిలో వరిపొలాలు

### ఏడు ప్రాంతాల్లో సహాయక శిబిరాలు

వరదనీరు కారణంగా నిరాశ్రయులైన ప్రజల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏడు చోట్ల సహాయక శిబిరాలను నగరపాలకసంస్థ ఏర్పాటు చేసింది. పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాల, పాతగుంటూరు యాదవ హైస్కూల్, లీలామహల్ దగ్గ ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాల, పొన్నూరు రోడ్డులోని అంజుమన్ స్కూల్, ఇశ్రాయల్ పేటలోని బొర్రా నాగేశ్వరరావు స్కూల్, నందివెలుగురోడ్డులోని వినోభానగర్ స్కూల్, సంజీవయ్యనగర్‌లో పీనపాటి ప్రభుదాస్ హైస్కూల్‌లో శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యుత్, తాగునీరు, భోజన సదుపాయాలను కల్పించనున్నట్లు నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు.



నందివెలుగులో పింఛన్లు అందిస్తున్న మంత్రి మనోహర్ దంపతులు

## వర్షంలోనూ ఆగని పింఛన్ల పంపిణీ

- ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు కానుక అందించిన ప్రభుత్వం
- మూడు జిల్లాల్లో 80 శాతానికి పైగా లబ్ధిదారులకు అందిన నగదు

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెల ఒకటో తేదీన అందాల్సిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందింది. గురువారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా, శనివారం భారీ వర్షంగా మారి వరదలు ముంచెత్తుతున్నా వెనక్కి తగ్గేదే లేదన్నట్లు ప్రభుత్వం పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సాగించింది. లక్షలాది మంది వలంటీర్లు ఉంటే తప్ప మా వల్ల కాదంటూ చేతులెత్తేసిన గత ప్రభుత్వానికి చెంపపెట్టులా సచివాలయ ఉద్యోగులే వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో కూటమి ప్రభుత్వ పని విధానంపై సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం వర్షాలు, వరద బీభత్సం తీవ్రంగా వుంది. అయినప్పటికీ పింఛన్ల బట్వాడా ఆగలేదు. వర్షాలు, వరద ముంపు భారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపడుతూనే పెన్షన్ల బట్వాడా సాగించారు. గుంటూరు జిల్లాలో 80.39 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. జిల్లాలో 2,56,890 మందికి గానూ 2,06,521 మందికి పెనన్లు అందాయి. పల్నాడు జిల్లాలో 85.4 శాతం మందికి అందాయి. జిల్లాలో 2,77,282 మంది పింఛనుదారులు ఉండగా 2,36,867 మందికి పెనన్లు అందాయి. ఈ ప్రాంతాల్లో వరద ప్రభావం ఎక్కువగా వుండడంతో లబ్ధిదారులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. వారికి ఆది, సోమవారాల్లో పింఛన్లు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 89.93 శాతం పింఛన్లు అందాయి. జిల్లాలో 2,31,200 మంది లబ్ధిదారులుండగా, 2,07,914 మందికి పింఛన్లు అందాయి.



పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్


కొండ చరియలు విరిగిపడి మృతి చెందిన వృద్ధురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

4లో..


గంజాయి, రేషన్ మాఫియాపై

## ఉక్కుపాదం మోపాలి

- కేంద్ర మంత్రి పెమ్మసాని

# వాణిజ్య పంటలకు వరద దెబ్బ


కొల్లూరులో అరటి తోటను ముంచెత్తిన వరద నీరు


కొల్లూరు: వంగ తోటలో

- చెరువులను తలపిస్తున్న వరి పొలాలు
- భారీగా నిలిచిన వర్షపు నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. లంక గ్రామాల్లోని వాణిజ్య పంటల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. మరో వైపు కృష్ణానదికి వరద నీరు పోటెత్తడంతో లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి. చింతల్లంక వద్ద పాయలో నుంచి వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతూ సుగ్గునలంక వైపు ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చినరేవులో నుంచి వరద నీరు దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంకకు వెళ్లే చప్టాపై ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. చినరేవు వెంబడి అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలను వరద నీరు ముంచెత్తింది. గాజుల్లంక వద్ద ఇటుక బట్టీల్లో వరద నీరు భారీగా చేరింది. భట్టిప్రోలు మండలంలోని పెదలంక, చింతల్లంక, చింతమోటు వద్ద కూడా చినరేవులో నుంచి భారీగా వరద నీరు పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. కొల్లిపర మండలంలో పసుపు, అరటి, కంద, జామ, కూరగాయల తోటల్లోకి వర్షపు నీరు చేరటంతో ఎక్కడ దెబ్బతింటాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటకాల్వల్లోని నీరు స్తంభించటంతోపాటు వర్షపు నీరు తోడు అవటంతో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పద్ధతి ద్వారా వేసిన వరినాట్లు వర్షానికి నీటిలో తేలియాడటంతో పాటు పల్లపు ప్రాంతాల్లో వేసిన వరినాట్లు సముద్రాన్ని తలపిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.


కొల్లిపర శివారు గుబ్బిడివారిపాలెంలో జామతోటలో..


కొల్లిపర: పసుపు తోటలో..

# గంజాయి, రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

- గుంటూరులో ఈవ్ టీజింగ్ మాట వినపడకూడదు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని, పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పోలీసు అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీశ్ కుమార్ పెమ్మసానితో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈవ్ టీజింగ్ మాట వినపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్ నియంత్రణ కోసం కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందనీ, రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు అందించడంలో ఎంతో నిబద్ధతతో ఉందని, రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు వున్నారు.


పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

### భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

వాగులు, పొంగి పొర్లుతున్నాయని, ప్రజలు, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన పునరావాసం కల్పించాలని సూచించారు. గుంటూరు జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 98499 04013, 0863- 2234014 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### చిన్నారుల మృతి బాధాకరం

భారీ వర్షాలకు శనివారం గుంటూరు జిల్లా ఉప్పలపాడు గ్రామ శివారు వాగులో కారు ప్రమాద ఘటనలో ముగ్గురు మృతి చెందిన వార్త తెలుసుకున్న పెమ్మసాని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్కూలుకు తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు నడుంపల్లి రాఘవేంద్ర, కోడూరి మాన్విక్, పసుపులేటి సౌరిష్ మరణించారు. వారికి పెమ్మసాని చంద్రశేఖర్ నివాళులు అర్పించి, వారికుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

### మూడు వారాల్లో పరిష్కరిస్తాం

పోస్టల్ జీడీఎస్ ఉద్యోగుల ఉద్యోగోన్నతి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తానని పెమ్మసాని హామీ ఇచ్చారు. పులివెందుల నుంచి వచ్చిన పోస్టల్ ఉద్యోగులుశనివారం పెమ్మసానిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పోస్టల్ శాఖలో ఉద్యోగోన్నతి కోసం 2022, 2023లలో 2 వేల మంది పరీక్షలు రాయగా, రాష్ట్రంలో ఖాళీలు లేవన్న కారణంగా తమకు ఉద్యోగోన్నతి కల్పించలేదని ఉద్యోగులు తెలిపారు. ఢిల్లీలో 3,600 పోస్టులు ఖాళీ ఉండడంతో అక్కడ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చామని వివరించారు. ఢిల్లీలోని అధికారులతో చర్చించి మూడు వారల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## వృద్ధురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

మంగళగిరి సిటీ, ఆగస్టు 31: మంగళగిరిలో కొండచరియ విరిగిపడి మృతి చెందిన నాగరత్నమ్మ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నష్టపరిహారం ప్రకటించారు. నాగరత్నమ్మ మృతి వార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. అధికారులు, టీడీపీ నాయకులను పంపించి జరిగిన సంఘటనపై వాకబు చేయించారు. టీడీపీ నేతలు నాగరత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణమే మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి లోకేశ్ చొరవతో సీఎం చంద్రబాబు మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని శనివారం సాయంత్రం ప్రకటించారు.

### మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

పెదకాకాని, ఆగస్టు 31: ఉప్పలపాడు గ్రామంలో చనిపోయిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రకటించారు. శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున చెల్లిస్తామని ఆయన తెలిపారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 111, 119, 130 |
| చికెన్ విత్ స్కిన్ | 210.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 220.00 |

# మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు : మంత్రి అనగాని



రేపల్లె, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం సూచించారు. అత్యవసరమైతే తప్పా ఎవరూ బయటకు రావొద్దని అన్నారు. జలమయమైన లోతట్టు ప్రాంతాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా రెవెన్యూ యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూశాఖాధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు తెగిపడినచోట తక్షణమే చర్యలు తీసుకోవాలని, వర్షాలకు ఉధృతంగా ప్రవహించే వాగులు దగ్గర హెచ్చరిక బోర్డులు పెట్టాలని సూచించారు. విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అలెర్టెగా ఉండాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జాగ్రత్త వహించాలన్నారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు తీరం చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీనేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయుగుండం తీరం దాటేటప్పుడు వర్షాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉందన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందన్నారు. ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. చెరువులు, నదులు ఎక్కువగా ప్రవహించే చోట ప్రజలు ప్రయాణం చేయవద్దన్నారు. విద్యుత్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ విపత్కర పరిస్థితిలో ప్రజలకు తోడుగా నిలుస్తూ, చేతనైన సహాయం చేయాలని కోరారు. మా కార్యాలయం నుంచి ఏ అవసరం ఉన్నా అందుబాటులో ఉంటామన్నారు. అవసరమైన వారు నరసరావుపేట 9849121352, 7660992306, 8328306442, గుంటూరు 936643099, 8333835555 నంబర్లను సంప్రదించాలన్నారు.

# పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- సామాజిక పింఛన్ల పంపిణీలో మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 31: పేదలకు అండగా ఉండి వారి అభ్యున్నతికి పాటు పడటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజవర్గ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. అనంతరం పలు వార్డులు, మండలంలోని జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పింఛన్ సొమ్మును అందించారు. రానున్న రోజుల్లో మరింత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సెప్టెంబరు 1న అందించాల్సిన పింఛన్లను 31నే అందిస్తున్నట్లు తెలిపారు. 1వ తేదీ ఆదివారం రావడం, బ్యాంకులు ఇతర కార్యాలయాలకు సెలవు కావడంతో లబ్ధిదారులు పింఛన్ కోసం వేచి చూడకూడదన్న ఉద్దేశంతో ముందురోజే పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నామని, అధికారం చేపట్టిన వెంటనే పింఛన్లను పెంచి వారికి ఆర్థిక భరోసాగా కూటమి ప్రభుత్వం నిలిచిందని మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# రేపు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్నాతకోత్సవం


స్నాతకోత్సవానికి సిద్ధమవుతున్న ఎస్ఆర్ఎం ప్రాంగణం

మంగళగిరి సిటీ, ఆగస్టు 31: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 2 తేదీన మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీ ఆవరణలోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లను పూర్తి చేసింది. వర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆక్సిలర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కోఫౌండర్ పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాల క్రిష్నన్, గౌరవ అతిథిగా స్విగ్గీ ఫుడ్ మార్కెట్ సీఈవో రోహిత్ కపూర్ హాజరుకానున్నారు. నాలుగో స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ మొత్తం 1018 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనుంది. వీరిలో ప్రతిభ కనబర్చిన 28 మంది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందుకోనున్నారు. 24 మంది పీహెచ్ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజనీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ, 29 మంది బీబీఏ, ముగ్గురు బీకాం పూర్తి చేసుకుని డిగ్రీలను అందుకోనున్నారు. వీరితోపాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో డీన్‌లు డాక్టర్ వినాయక్, డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్ సింగ్, పంకజ్, అనిల్ నిగమ్, ఫెర్నాండేజ్, రేవతీలు స్నాతకోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# ఉమ్మడి పరిశోధనలకు ఎంవోయూ


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 31: వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేటు లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఏపీఎల్ ఆర్ అండ్ డి జనరల్ మేనేజర్ జేఎల్‌పి తిలక్‌తో వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్ తదితరులు ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. దీనివల్ల ఏరోస్పేస్ ఇంజినీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీలకు సంబంధించిన రంగాల్లో ఉమ్మడి పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్ ప్రాజెక్టులను సులభతరం చేయడం సాధ్యమౌతుందని వీసీ వెల్లడించారు.

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం

## టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేయండి

- బాలకుటీర్ లీజు పొడిగింపుపై, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అడ్డగోలు నియామకంపై చర్చ
- కౌన్సిల్ హాల్‌కు లీకులతో వర్షపు నీరు కారడంతో కార్పొరేటర్ల అసహనం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 31: కాకాని రోడ్డులోని పందుల కాలనీ సమీపంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో నిందితులను ఇంతవరకు అరెస్టు చేయలేదని, ఎటువంటి విచారణ చేపట్టలేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, కామిరెడ్డి రంగారెడ్డిలు పట్టుబట్టారు. మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధ్యక్షతన గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం వ్యవహారం మరోమారు తెరపైకొచ్చింది. గతంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులన్నీ లోపభూయిష్టంగా జరిగాయని, ఇందులో కోట్లాది రూపాయలు అక్రమాలు జరిగాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో తన అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని, ఇప్పుడు ఎవరో వ్యక్తి స్పందనలో పెడితే ఈ విషయమై స్పందిస్తారా అంటూ కార్పొరేటర్ రంగారెడ్డి నిలదీశారు. ఇంకా అనేక అంశాలపై చర్చ జరిగింది. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ పాఠశాల లీజు పునరుద్ధరణ అంశంపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. మెజార్టీ సభ్యులు ఆ పాఠశాల లీజ్‌ను పొడిగించాలని తీర్మానించారు. కౌన్సిల్ సమావేశంలో మొత్తం 36 అంశాలతో ఎజెండాని పెట్టగా అందులో ఒక అంశం మినహా మిగతా 35 అంశాలకు కౌన్సిల్ ఆమోద తెలిపింది. జీఎంసీలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సబ్ కమిటీ వేయాలని సూచించారు. అడ్డగోలుగా నియమించిన 109 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నిలిపేయాలని కోరారు. జిఎంసి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. భారీ వర్షానికి కౌన్సిల్ హాల్‌కు లీక్‌లు ఏర్పడి వర్షపు నీరు కారడంతో కార్పొరేటర్లు ఒకింత అసహనానికి గురయ్యారు. ఇంత నాసిరకంగా పనులు చేపట్టిన ఆ కాంట్రాక్టర్ ఎవరని వారు ప్రశ్నించారు.

### రైల్వే మొండి గేటును విస్తరించాలి: ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

పాత గుంటూరు పరిధిలోని రైల్వే ట్రాక్ పై రైల్వే మొండిగేటును విస్తరించాలనిగుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ప్రజల తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, మొండి గేటును విస్తరిస్తే వర్షపు నీరు పూర్తిగా హైవే కి చేరుతుందని, అక్కడినుండి కాలువ ల ద్వారా ఆ నీరు దూరంగా పోతుందని అన్నారు. ఇందుకోసం రూ.8 కోట్ల ఖర్చు అవుతుందని, అందులో రైల్వే శాఖ రూ.4 కోట్లు, కార్పొరేషన్ రూ.4 కోట్లు భరించాల్సి ఉంటుందని వివరించారు.

### ప్రజా ప్రయోజనార్థం లీజ్ గడువు పొడిగించాలి : ఎమ్మెల్యే మాధవి

ప్రజా ప్రయోజనార్థం బాల కుటీర్ పాఠశాల లీజు గడువును పొడిగించి ఆమోదించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరంలో ఎన్నో పాఠశాలలు ఉన్నప్పటికీ నిబంధనలకు కట్టుబడి ఈ పాఠశాలను నడుపుతున్నట్లు చెప్పారు. లీజ్ రేట్లు నిబంధన ప్రకారం పెంచి వారికి అప్పగించాలని, ఈ విషయంలో ప్రజాప్రతినిధులందరూ ఏక అభిప్రాయం తెలపాలని కోరారు. ప్రజా ఆమోదం పొందిన బాల కుటీర్‌కు లీజును పొడిగించాలని, దీనికి తాను ఆమోదం తెలుపుతున్నట్లు తెలిపారు.

### 60 ఏళ్లుగా ఈ పాఠశాల నడుస్తోంది: ఎమ్మెల్సీ లక్ష్మణరావు

శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ పాఠశాల 60 సంవత్సరాలుగా నడుస్తోందని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా జీఎంసీకి పన్నులు చెల్లిస్తున్నారన్నారు. తక్షణమే ఈ పాఠశాల లీజ్ గడువు పొడి గింపునకు అనుమతిస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. ఇందుకు కార్పొరేటర్లు బాలాజీ, కోవెలమూడి రవీంద్ర, అంబేద్కర్, రోషన్, సీతా పద్మజతో పాటు పలువురు కార్పొరేటర్లలో ఒకటి బై మూడో వంతు సభ్యులు ఆమోదం తెలిపారు.

### ప్రజల ఆకాంక్ష మేరకు నిర్ణయం చేయాలి: మేయర్ మనోహర్ నాయుడు

బాల కుటీర్ లీజు పునరుద్ధరణపై చర్చించి భిన్నభిప్రాయాలు చెప్పారని, లేఅవుట్ ఖాళీ స్థలం స్కూల్ కి గతంలో కేటాయించారని, 25 ఏళ్ల లీజు రెండు పర్యాయాలు పొడిగించిన విషయాన్ని మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తావించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టు జడ్జిమెంట్ మేరకు మూడోసారి లీజ్ ఇవ్వకూడదని, ఓపెన్ ఆక్షన్ పెట్టాలి కానీ, ప్రజల ఆకాంక్ష మేరకు నిర్ణయం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుత మార్కెట్ విలువ పై వివరాలు తీసుకొని ప్రభుత్వానికి పంపాలని, పిల్లల భవిష్యత్, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాల మేరకు చట్టాలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై కౌన్సిల్ ఆమోదం తెలపలేదు..వ్యతిరేకించడం లేదని చెప్పారు.

## ప్రజారోగ్యం కోసం ప్రభాకర్ కృషి అభినందనీయం : ఎస్పీ



పోలీస్ సిబ్బందికి మందులు అందజేస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్, పక్కన డేగల ప్రభాకర్

గుంటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్న డేగల ప్రభాకర్ కృషి అభినందనీయమని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ కొనియాడారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని ఆంధ్ర ప్రైమ్ ఆసుపత్రిలో 'ప్రజల కోసం పోలీస్.. పోలీసుల కోసం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్' పేరుతో శనివారం పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఆరోగ్యం గురించి ఆంధ్ర ప్రైమ్ ఆసుపత్రి ఛైర్మన్ డేగల ప్రభాకర్ చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యమే ధ్యేయంగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన ఆసుపత్రి వైద్య బృందం, ఛైర్మన్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడే పోలీసు సిబ్బంది ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, వారికి ఈ వైద్యశిబిరం ఉపయోగపడుతుందన్నారు. మెడికల్ క్యాంపు స్క్రీనింగ్ టెస్టు, గైనకాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, పల్మనాలజీ, పీడియాట్రిక్, షుగర్, థైరాయిడ్, న్యూరో, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ మొదలైన నిపుణులు అందుబాటులు వుంటారని, వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. పోలీసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు అన్వేశ్ కుమార్, సాయి రాజశేఖర్, తేజస్వి, పవన్, జగదీశ్, కోటి వెంకటేశ్వరరావు, మాధవీలత, హిమబిందు, ఆసుపత్రి సీఈవో పార్థసారథి, ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ శాంతికుమార్, సీఐలు పాల్గొన్నారు.

## మరికొన్ని రైళ్లు రద్దు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా రైల్వేట్రాక్ పలు చోట్ల దెబ్బతినడంతో మరికొన్ని రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసినట్లు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆదివారం నడవాల్సిన రైళ్లు.. నంబర్ 07783- విజయవాడ - గుంటూరు, 07779-గుంటూరు - మాచర్ల, 07580- మాచర్ల - నడికుడి, 07579- నడికుడి - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07788- గుంటూరు-విజయవాడ రైళ్లను రద్దు చేశారు. అలాగే ఆది, సోమవారాల్లో నడవాల్సిన 07464-విజయవాడ - గుంటూరు, 07465-గుంటూరు - విజయవాడ రైళ్లను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.



## పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

గుంటూరు, ఆగస్టు 31 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేస్తున్న నలుగురు పోలీసు అధికారులకు ఎస్పీ ర్యాంట్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, ఎఆర్ డిఎస్‌పి శాంతకుమార్ శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వెల్ఫేర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ముంచెత్తిన వాన

- అల్పపీడనంతో కుండపోత వర్షం
- నీట మునిగిన అపార్టుమెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్ సెల్లార్లు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



వర్షపు నీటితో ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం తుపానుగా మారి జిల్లాపై తీవ్ర ప్రభావాన్నే చూపించింది. శుక్రవారం రాత్రి చిన్నపాటి వర్షంతో ప్రారంభమై శనివారం ఉదయానికి తీవ్ర రూపం దాల్చింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా కురిసిన కుండపోత వర్షం గుంటూరు జిల్లాను వణికించింది. శుక్రవారం రాత్రి మొదలుకొని శనివారం సాయంత్రం వరకు దాదాపుగా 24 గంటల పాటు కురిసిన భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలసంద్రంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. సైడుకాలువలు, అవుట్‌ఫాల్ డ్రెయిన్లు పొంగి రోడ్ల పైకి ప్రవహించడంతో చాలా చోట్ల రోడ్ల ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. వరదనీటి ప్రవాహ ఉధృతికి రోడ్ల పైన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే కాకుండా కార్లు, ఆటోలు వంటివి కూడా కొంతదూరం కొట్టుకుపోయాయి. అపార్టుమెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలోకి నాలుగు అడుగుల మేరకు వర్షపునీరు చేరడంతో అక్కడ పార్కింగ్ చేసిన వాహనాలు నీట మునిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల నివాసాల్లోకి కూడా వరదనీరు వచ్చి చేరింది. పలుచోట్ల విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. ఈదురుగాలికి చెట్లు నేలకొరగడంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

వరదనీరు అవుట్‌ఫాల్ డ్రెయిన్ల ద్వారా ఊరి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆయా డ్రెయిన్లు వెనక్కు తన్ని జనావాస ప్రాంతాల్లోకి ప్రవహించాయి. ఏటీ అగ్రహారం, శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు, పొన్నూరు రోడ్డు, శివారెడ్డిపాలెం, శారదా కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, కోబాల్డ్‌పేట తదితర ప్రాంతాలపై వరదనీరు ప్రభావం చూపించింది. పీకలవాగు, నందివెలుగురోడ్డు, పొన్నూరు రోడ్డులోని అవుట్‌ఫాల్ డ్రెయిన్లు ఇళ్లల్లోకి ప్రవహించాయి. చుట్టుగుంట మొదలుకొని హిందూ కళాశాల వరకు, నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయం, మహిళా కళాశాల రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డుల్లోకి వరదనీరు చేరడంతో శనివారం సాయంత్రం వర్షం వెలిసిన తర్వాత ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆఫీసర్స్ క్లబ్ వద్ద భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా నేలకొరగడంతో ఐబీ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపేశారు. నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, హనుమాన్‌నగర్, నల్లకుంట, మురికిపేటతో పాటు కేవీపీ కాలనీ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా కంకరగుంట ఆర్‌యూబీ, డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద నాలుగు అడుగల మేరకు వరదనీరు చేరి నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను అధికారులు నిలిపేశారు. నగరపాలకసంస్థ పక్కనే ఉన్న వెన్‌లాక్ మార్కెట్ సెల్లార్ పరిస్థితి భయానకంగా మారింది. వర్షం కారణంగా విద్యుత్ తీగెలు తెగిపోవడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తరచుగా విద్యుత్ కోతలను విధించారు. ఈ కారణంగా సాయంత్రం కొన్ని కాలనీల్లో తాగునీటి సరఫరా జరగలేదు. వర్షపు నీటితో నిండిన బ్రహ్మానందరెడ్డి స్టేడియం చెరువులా మారడంతో అందులోకి పరిసర ప్రాంతాల పిల్లలు వెళ్లి జలకాలాడారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు కూడా పట్నంబజారు, బ్రాడీపేట, అరండల్‌పేట మెయిన్‌రోడ్లు, ఏలూరుబజారులోని దుకాణాలు తెరుచుకోలేదు.

### చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం

రోడ్లనే ఆధారంగా చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకొనే వారు వర్షం కారణంగా కుదేలయ్యారు. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు విక్రయించే వారు తీవ్రంగా నష్టపోయారు. ముందురోజు కొనుగోలు చేసి పెట్టుకొన్న కూరగాయలు, పండ్లు వర్షం కారణంగా కుళ్లిపోవడంతో వాటిని చెత్తకుండీల్లో పారబోయాల్సి వచ్చింది. అలానే పూల వ్యాపారస్థులు కూడా నష్టపోయారు. కాగా వర్షం గొడుగులు, టోపీలు, రెయిన్‌కోట్ల వ్యాపారస్థులకు లబ్ధి చేకూర్చింది.

● గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 31:నల్లచెరువు, పాత గుంటూరు, శివారు కాలనీల్లో మోకాలు లోతు వర్షపు నీరు చేరింది. స్థానిక డొంకరోడ్డు, కంకరగుంట ఆర్‌యుబి కింద రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిఎంసి ప్రధాన కార్యాలయంలోకి నీరు చేరింది.

### గంట పాటు భయపెట్టిన ఉరుములు, పిడుగులు

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు భారీ వర్షం.. మరో వైపు గంట పాటు గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉరుములు, పిడుగులు ప్రజా నీకాన్ని భయకంపితులను చేశాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయం దాటిన తర్వాత పిడుగులు పడ్డాయి. ఆ శబ్దాలకు చాలామంది తమ ఇళ్ల పక్కనే పిడుగు పడిందేమోనని భయాందోళనలకు గురయ్యారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాని పలుచోట్ల నిలిపేశారు. ప్రజలు కూడా ముందుజాగ్రత్తగా విద్యుత్ ఉపకరణాల ప్లగ్‌లను తీసివేశారు. వర్షం కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక భారతపేట, పోస్టల్ కాలనీ, శ్రీనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఈ మూడు కాలనీల ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బందికి అనేకసార్లు ఫోన్లు చేసినా స్పందించలేదని, రాత్రి 9 గంటలకు కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదని వాపోయారు.

### ఆర్టీసీ సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం

గుంటూరు, ఆగస్టు 31: జిల్లా వ్యాప్తంగా వర్షం దంచి కొడుతుండటంతో ఆర్టీసీ సర్వీసులను డిపోలకు పరిమితం చేశారు. గుంటూరు నుంచి అమరావతి వైపునకు వెళ్ళే మార్గంలో సర్వీసులను రద్దు చేశారు. మరో వైపు గుంటూరు-విజయవాడ మార్గంలో సర్వీసులను పూర్తిగా నిలిపివేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్ తెలిపారు. మంగళగిరి సమీపంలోని కాజా టోల్ గేట్, ఆటోనగర్ శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపైకి వర్షపు నీరు చేరడంతో, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరో వైపు గుంటూరు - పర్చూరు రూట్‌లోనూ అనేక సర్వీసులను నిలిపివేశారు. ఇక గుంటూరు-చిలకలూరిపేట, నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల, తెనాలి రూట్‌లలో సర్వీసులు యధావిధిగా రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. ఇక వర్షం ఆర్టీసీ ఆదాయంపై కూడా ప్రభావం చూపింది. ఉదయం నుంచి కూడా ప్రయాణీకుల్లేక బస్టాండ్‌లు వెలవెలబోయాయి. అనేక సర్వీసులు అతి కొద్ది మంది ప్రయాణీకులతో రాకపోకలు సాగించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోకి వర్షపునీరు చేరింది. దాంతో ఒక్కసారిగా అధికారులు ఆందోళనకు గురయ్యారు. మరో వైపు గుంటూరు-1, 2 డిపో గ్యారేజ్‌లలోకి వర్షపునీరు పెద్ద ఎత్తున చేరింది. విద్యుత్ సరఫరాను నిలిపివేసి చర్యలు తీసుకున్నారు.



గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెంలో నీట మునిగిన పత్తి పంట

### వరి సాగు రైతు పరిస్థితి దైన్యం

గుంటూరు సిటీ, ఆగస్టు 31 : అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావం గుంటూరు జిల్లా రైతాంగంపై పడింది. పచ్చగా ఉన్న పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తుండటంతో అన్నదాత కంట కన్నీరు వొలుకుతోంది. ముఖ్యంగా వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గుంటూరుజిల్లాలో 42 వేల ఎకరాల్లో పంట పూర్తిగా నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా. కొల్లిపర, దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు, చేబ్రోలు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, తాడికొండ మండలాల్లో పంట నీట మునిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా మండలాల్లో వరి పూర్తిగా మునిగింది. పత్తి పంట కూడా చాలా మండలాల్లో ముంపునకు గురైంది. అయితే మొక్క ఏపుగా పెరగడం వల్ల పెద్దగా నష్టం ఉండదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### కొంపముంచుతున్న డ్రెయిన్లు

వర్షం వస్తే డెల్టా ప్రాంతం చిగురుటాకులా వణికిపోవటానికి ముఖ్య కారణం అక్కడున్న డ్రెయిన్ల సమస్యే. చాలా చోట్ల పొలాల్లోకి వచ్చిన నీరు బయటకు పోయే పరిస్థితి లేదు. దీంతో, వర్షపు నీరు అంతా పొలాల్లో నిలిచిపోతోంది. వట్టిచెరుకూరు మండలంలో కూడా ఈ సమస్య ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖ అక్కడి రైతులను డ్రెయిన్లను బాగు చేసుకోవాలని పలుమార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం ఈ మండలంలోని పొలాలు వాగుల్లా మారాయి. పెదనందిపాడు మండలానికీ ఇదే సమస్య ఉంది. నల్లమడ కాల్వకు వరద నీరొస్తే ఈ మండలం నష్ట పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### 21 శాతం అధిక వర్షపాతం

జిల్లాలో ఈ నెలలో 21 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో 164.7 మిల్లీ మీటర్ల వర్షపాతం సాధారణంగా, అల్పపీడన ప్రభావంతో 198.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళగిరిలో శనివారం 279.5 మి.మీ,తుళ్లూరులో 224.5 మి.మీ,తెనాలిలో 179 మి.మీ ,పొన్నూరులో 131 మి.మీ, గుంటూరు లో 112 మి.మీ, తాడేపల్లి లో 97.75 మి.మీ ,ప్రత్తిపాడు లో 78 మి.మీ వర్షపాతం నమోదైంది.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. రైతులకు తగిన, సలహాలు సూచనలు చేసేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులు ఏ అవసరం ఉన్న అధికారులను సంప్రదించాలని కోరారు. ప్రస్తుత పంటల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెప్పారు.

## వరద సహాయక చర్యలు చేపట్టాం : కలెక్టర్

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త, సహాయక చర్యలను తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శనివారం భారీగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు వద్ద వాగులోకి కారు కొట్టుకుపోయి మరణించిన నడింపల్లి రాఘవేంద్రరావు (38), పసుపులేటి సాదీష్ (8) కోడూరి మన్విత్ (9), మంగళగిరి కొత్తపేటలో కొండచరియలు విరిగి రుక్క నాగరత్నమ్మ(88) మరణించిన ఘటనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని ఒక్కొక్కరికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం తరుపున ప్రకటించారన్నారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాల్లోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ రహదారి ఖాజా టోల్ ప్లాజ్ వద్ద నిలిచిపోయిన వర్షం నీరు ఎన్‌హెచ్, ఎంటీఎంసీ అధికారులు డ్రెయిన్లలోకి మళ్ళించి జాతీయ రహదారిపై రాకపోకలను పునరుద్ధరించారని అన్నారు. కలెక్టరేట్ జిల్లా స్థాయిలోను, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ఆర్డీవో కార్యాలయాలతో పాటు గుంటూరు, ఎంటీఎంసీ నగరపాలక సంస్థల్లో, అన్ని తహశీల్దారు కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటిని పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి సరఫరా చేసేలా, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. వి ద్యుత్ సమస్యలపై ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు స్పందించాలని ఆదే శాలు జారీ చేశామన్నారు. వర్షాలు తగ్గేవరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వార్షిక నివేదిక విడుదల

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విడుదల చేశారు. శనివారం ఆమె నగరంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ కే ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు బోర్డు డైరెక్టర్‌గా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎనిమిది జిల్లాల్లోని 265 శాఖల ద్వారా 29.50 లక్షల మంది ఖాతాదారులకు బ్యాంకు సేవలందిస్తోందని గత ఆర్థిక సంవత్సరానికి రూ. 21,444 కోట్ల వ్యాపారంతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్యాంకు నిర్వహణాధికారులు, సిబ్బంది, ఖాతాదారులకు అభినందనలు తెలిపారు. బ్యాంకు ఛైర్మన్ కే ప్రమోద్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పనితీరుపై ఖాతాదారులు ఉంచిన నమ్మకానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ నుంచి నామిని డైరెక్టర్ కే సంతోష్, యూబీఐ నుంచి ఏ రవికుమార్, ఎస్ శ్రీనివాస్, సీజీజీబీ నుంచి జనరల్ మేనేజర్ వీ మారుతీరామ్ పాల్గొన్నారు.

## సాంప్రదాయ వ్యవసాయ పరిశోధనల్లో విజయకుమార్ విశేష కృషి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31: రైతు సాధికార సంస్థ ద్వారా సాంప్రదాయ వ్యవసాయానికి విశేషంగా కృషిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి తల్లం విజయ్ కుమార్ సేవలు అభినందనీయమని ఏపి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేకర్ అన్నారు. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్డు, ఓ హోటల్లో సాంప్రదాయ వ్యవసాయ పరిశోధనలలో విశేషంగా కృషి చేసినందుకు టి విజయ్‌కుమార్‌ని పోర్చుగిస్ దేశం ప్రతిష్ఠాత్మకమైన గుల్బెన్ కియన్ అవార్డుతో సత్కరించిన సందర్భంగా సత్కార సభ నిర్వహించారు. సభకు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వైస్ ఛైర్మన్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్ అధ్యక్షత వహించారు. రైతు నేస్తం ' ఎడిటర్ వై.వెంకటేశ్వరరావు, విజయ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఫార్చ్యూన్ మురళి, పార్క్ ఎండి ముత్తవరపు మురళీకృష్ణ, ఐ టి సి ఉపాధ్యక్షుడు కే కృష్ణకుమార్ పాల్గొన్నారు.

## వీఆర్‌కు ఎస్‌బి-2 సీఐ ఆనందరావు

గుంటూరు, ఆగస్టు 31 : స్పెషల్ బ్రాంచ్-2 సీఐ ఆనందరావును వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన కొంత కాలంగా ఎస్‌బీ సీఐగా పని చేస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఓ ఎంపీకి అత్యంత సన్నిహితంగా ఆయన వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పోలీస్ పాలనా వ్యవహారాల్లో స్పెషల్ బ్రాంచ్ అత్యంత కీలకమైనది కావడంతో ఇక్కడి విషయాలు లీక్ కాకుండా అత్యంత రహస్యంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎటువంటి అనుమానాలకు తావులేకుండా ఆయనను బదిలీ చేశారని తెలుస్తోంది. అంతేగాక కొంత కాలంగా ఎస్‌బి సిబ్బంది కూడా ఆయన వ్యవహారశైలి పై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు ప్రజా ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా ఎస్‌బీ-1 సీఐగా ఆళ్ళహరి శ్రీనివాసరావు ఇటీవల నియమితులైన విషయం విదితమే.

## పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

గుంటూరు, ఆగస్టు 31 : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమ పరిధిలో సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లాలో పొంగే వాగులు, వంకల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన వాగులు వద్ద ప్రజలను రోడ్డు దాటేందుకు అనుమతివ్వరాదన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే కంట్రోల్‌రూమ్ నంబర్ 0863 2234014కు ఫోన్ చేయాలన్నారు.



## జోరువానతో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

- పలు ప్రాంతాల్లో విరిగిపడిన వృక్షాలు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన పునరుద్ధరణ పనులు

గుంటూరు, ఆగస్టు 31: అల్పపీడన ద్రోణితో జిల్లా వ్యాప్తంగా శనివారం వర్షం దంచికొడుతోంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. గుంటూరు సర్కిల్‌లోని గుంటూరు-1, నరసరావుపేట, మాచర్ల, తెనాలి, బాపట్ల డివిజన్‌లలో.. పొన్నూరు, తెనాలి, రేపల్లె, రేపల్లె రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక జిల్లా కేంద్రం గుంటూరు నగరంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శ్యామలానగర్, అమరావతి రోడ్డు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలటంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. కాగా, గుంటూరు టౌన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసబాబు నగరంలో విద్యుత్ సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించారు. ఇక సీఆర్‌డిఏ పరిధిలోని గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లలోనూ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. సీఆర్‌డిఏ సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్ విద్యుత్ సరఫరాపై అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై అధికారులతో సమీక్షించి అదనపు సిబ్బందితో అర్ధరాత్రి వరకు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

### గుంటూరులో విద్యుత్ ఏఈకి తృటిలో తప్పిన ప్రమాదం

గుంటూరులో విద్యుత్ ఆపరేషన్ డి7 ఏఈ ఉదయ్‌కిరణ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. అమరావతి రోడ్డులోని 33 కేవీ సబ్ స్టేషన్ లైన్ బ్రేక్ డౌన్ కావడంతో , సమీక్షించేందుకు వెళ్ళిన ఆయనకు మార్గమధ్యంలో లాం వద్ద భారీ వృక్షం కూలి ఏఈ కారుపై పడింది. దీంతో, ఉదయ్‌కిరణ్ భయాందోళనకు గురయ్యారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఆయన ఊపిరిపీల్చుకున్నారు.

### తురకపాలెం వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31: భారీ వర్షానికి గుంటూరు రూరల్ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. వాగులు పొంగడంతో అయా గ్రామాల మధ్యరాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా లాం నుంచి జొన్నలగడ్డ మధ్య ఉండే వాగు పొంగడంతో ప్రధాన దారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. 40వ డివిజన్ పరిధిలోని జన్మభూమినగర్, స్వర్ణాంధ్రానగర్ నుంచి తురకపాలెం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాగులు పొంగి వర్షపు నీరు రోడ్లపై నిలిచి పోయాయి.

## లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించండి: ఎమ్మెల్యే నసీర్



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతాల ప్రజలను సంరక్షించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో ఆయన శనివారం సమీక్ష జరిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గడ్డిపాడు చెరువు నిండి వరద నీరు ఇళ్లలోకి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఆటోనగర్, మద్దిరాల కాలనీ, బసవతారకనగర్, పాత గుంటూరు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. గత ప్రభుత్వం డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి వాగులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్లే నీరు పోయే దారి లేక రోడ్ల మీదకు, ఇళ్లలోకి నీళ్ల వస్తున్నాయని విమర్శించారు. ప్రధానంగా రైల్వే మొండిగేట్ వద్ద డ్రైనేజీ నిర్మాణం తక్షణం చేపడితే వరద ముంపు తగ్గుతుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. ఏ సమస్య వచ్చినా ఒక్క ఫోన్‌కల్ చేస్తే అందుబాటులో ఉంటానన్నారు.

### తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాస ఏర్పాట్లను ఎమ్మెల్యే పర్యవేక్షించారు. వెంటనే ఆంధ్ర ముస్లిం కాలేజ్, యాదవ హైస్కూల్, లీలా మహల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ హైస్కూల్, ఆర్టీసీ కాలనీ బుర్ర నాగేశ్వరరావు హైస్కూలు, పొన్నూరు రోడ్డు అంజుమన్ హైస్కూలు, సంజీవయ్యనగర్ పినపాక ప్రభుదాస్ హైస్కూల్, నందివెలుగు రోడ్డులో వినోభా నగర్ హైస్కూళ్లలో తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలకు అక్కడికి తరలించాలని ఆదేశించారు.

### బీఆర్ స్టేడియం.. జలమయం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 31: భారీ వర్షాల కారణంగా బీఆర్ స్టేడియం పూర్తిగా జలమయమైంది. స్టేడియం లోపల, వెలుపల వర్షపునీరు నిండి చెరువును తలపించింది. మరమ్మతుల పేరుతో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా చెడగొట్టేశారు. దీంతో ఎడతెరిపిలేకుండా కురి సిన వర్షానికి స్టేడియం వాన నీటితో నిండిపోయింది.

### నీట మునిగిన వర్సిటీ

పెదకాకాని, ఆగస్టు 31 : శనివారం కురిసిన భారీ వర్షంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అనేక విభాగాల్లోకి వర్షం నీరు చేరింది. వర్సిటీ ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండిపోయింది. లైబ్రరీతో పాటు వర్సిటీలోని ప్లే గ్రౌండ్, ఆడిటోరియం ఇలా అనేక ప్రాంతాల్లో మోకాళ్ళలోతు నీరు చేరింది. దీంతో లైబ్రరీలోని పుస్తకాలన్నీ తడిచిపోయాయి. విశ్వవిద్యాలయంలోని అనేక భవనాల్లో లీకులు ఏర్పడడంతో తరగతి గదులు, హాస్టల్ భవనాలలో విద్యార్థులు వుండడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### జోరువానలోనూ పింఛన్ల పంపిణీ

జోరువానలోనూ సామాజిక పింఛన్ల పంపిణీ ఆగలేదని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. వాన కురుస్తున్నప్పటికీ ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టామని, ఉదయం పది గంటలలోపే 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు.

### మురళీకృష్ణయాదవ్‌కు సత్కారం

గుంటూరు, ఆగస్టు 31: ఏపీ సీపీడీసీఎల్ ఆపరేషన్ సీజీఎమ్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఆవుల మురళీకృష్ణ యాదవ్ దంపతులకు సంగడిగుంట విద్యుత్ భవన్‌లో శనివారం ఘనంగా సత్కరించారు. విద్యుత్ భవన్‌లో ఉద్యోగుల ఆధ్వర్యంలో మురళీకృష్ణ యాదవ్ దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. మూడున్నర దశాబ్దాలుగా విద్యుత్‌శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన అజాతశత్రువుగా గుర్తింపు పొందారని ఉద్యోగులు కొనియాడారు. ఈ సందర్భంగా గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి శ్రీనివాసబాబు ఇతర అధికారులు డాక్టర్ విజయ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
ఆదివారం • 1 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com

క్లాప్...

## ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

## సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ చాయాగ్రాహకుడు.

## ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మి'తో పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

## 'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

## అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు

ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న ' 35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. 35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్‌షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండో సారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.



## ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

## అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

## మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్ల తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్' అని హరీశ్‌శంకర్ చెప్పారు.

# అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దేప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం





కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

### సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.

### నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.



కొల్లిపర మండలం అత్తోటలో పెన్షన్లను పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

## పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● సామాజిక పింఛన్ల పంపిణీలో మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 31: పేదలకు అండగా ఉండి వారి అభ్యున్నతికి పాటు పడటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజవర్గ వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. అనంతరం పలు వార్డులు, మండలంలోని జగ్గడి గుంటపాలెం గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా పింఛన్ సొమ్మును అందించారు. రానున్న రోజుల్లో మరింత అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లిపర: మండలంలోని అత్తోటలో కూటమి నాయకులు, అధికారులతో కలిసి మంత్రి మనోహర్ లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి చంద్రమోహన్, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, నాయకులు యర్రు వెంకయ్యనాయుడు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని చెముడుబాడు, దావులూరు గ్రామాల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### సభ్యుల గౌరవ వేతనాన్ని పెంచండి: కౌన్సిలర్ కోటేశ్వరావు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 31: మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల గౌరవవేతనాన్ని పెంచాలని వైసీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికలలో తాను అధికారం చేపట్టిన వెంటనే మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల గౌరవ వేతనాన్ని రూ.3500 నుంచి రూ.10వేలకు పెంచుతానని హామీ ఇచ్చారన్నారు. కౌన్సిల్ సభ్యుల కోరిక మేరకు విహారయాత్రకు త్వరలోనే ఏర్పాట్లుచేస్తామని చైర్‌పర్సన్ రాధిక తెలిపారు.

## కుంభవృష్టి

● పల్లపు ప్రాంతాలు జలమయం
● స్తంభించిన జన జీవనం
● మునిగిన పంటలు

కొల్లిపర, ఆగస్టు 31: అల్పపీడన ప్రభావంతో మండలంలో గత రెండు రోజుల నుంచి కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగుకాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. కొల్లిపరలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు నీటితో నిండిపోగా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులకు అసౌకర్యం కలిగింది. వాహనదారులు కూడా ఇబ్బందులు పడ్డారు. తూములూరు, దావులూరు, చివలూరు, జెముడుబాడు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. నందివెలుగులో రోడ్డుకూడా నీటితో నిండిపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.







తెనాలి బీసీ హాస్టల్ ప్రాంగణంలో, గదుల్లోకి వచ్చిన వర్షంనీరు, నీటిలో నానుతున్న స్టోర్‌రూమ్‌లోని బియ్యం బస్తాలు

### మున్సిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 31: పట్టణ మున్సిపల్ కార్యాలయంలో భారీ వర్షాల కారణంగా ప్రజా సమస్యల, ఫిర్యాదుల కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను శనివారం ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాల్ సెంటర్ 24గంటలు అందుబాటులో ఉంటుందని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నెం.1800-425668కి ఫోన్ చేసి తెలపాలని పట్టణ ప్రజలను కమిషనర్ కోరారు.

● తెనాలి అర్బన్: తెనాలి పట్టణంతో పాటు గ్రామాల్లో శనివారం ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం ముంచెత్తింది. దీంతో జనజీవనం స్తంభించింది. వర్షపు నీటికి శివారు కాలనీలు, పట్టణంలో సింహభాగం రహదారులు మోకాలి లోతు నీటితో నిండిపోయాయి. తెనాలిలోని బీసీ హాస్టల్‌లోకి వర్షం నీరు చేరింది. డివిజన్ పోస్టాఫీసులోకి నీరు చేరింది. పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోకి వర్షపు నీరు చేరింది. పట్టణంలోని రహదారులు జలమయం అయ్యాయి. ఆక్రమణల కారణంగా వర్షపు నీరు పారుదలకు డ్రెయిన్ల సామర్థ్యం సరిపోలేదు. గంగానమ్మపేట, బోస్‌రోడ్డు, కొత్తపేట, చిట్టాంజనేయ స్వామి ఆలయం రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు వంటి పలురోడ్లు జలాశయాలను తలపించాయి. రహదారులు రాత్రి పది గంటలకు గాని మామూలు స్థితికి చేరుకున్నాయి.



కొల్లిపరలో జలమయమైన ప్రధాన రహదారి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ములకా శివసాంబిరెడ్డి, రైతులు

### అధికారులందరూ అప్రమత్తంగా ఉండండి: మంత్రి నాదెండ్ల

తెనాలి, మారీసుపేట ఆగస్టు 31: అన్ని శాఖల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ మనోహర్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని స్వరాజ్ టాకీసు సెంటర్‌లో భారీ వర్షం కారణంగా నిలిచిపోయిన నీటిని తొలగించే పనులను అధికారులతో కలసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో డ్రెయినేజ్ వ్యవస్థను మరింత అధునీకరిస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని కమిషనర్ శేషన్నను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న, మున్సిపల్ సిటి ప్లానర్ సుధాకార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు రామచంద్రరావు, శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బం ది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోండి: ములకా

తెనాలి రూరల్, ఆగస్టు 31: భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఐతానగర్, నేలపాడు, తేలప్రోలు గ్రామాల్లో నీటమునిగిన వరిపైర్లను రైతులతో కలిసి పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### నీట మునిగిన యూనివర్సిటీ

పెదకాకాని, ఆగస్టు 31: శనివారం కురిసిన భారీవర్షంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అనేక విభాగాల్లోకి వర్షం నీరు చేరింది. వర్సిటీ ప్రాంగణమంతా వర్షపు నీటితో నిండిపోయింది. లైబ్రరీతో పాటు వర్సిటీలోని ప్లే గ్రౌండ్, ఆడిటోరియం ఇలా అనేక ప్రాంతాల్లో మోకాళ్ళలోతు నీరు చేరింది. దీంతో లైబ్రరీలోని పుస్తకాలన్నీ తడిచిపోయాయి. విశ్వవిద్యాలయంలోని అనేక భవనాల్లో లీకులు ఏర్పడడంతో తరగతి గదులు, హాస్టల్ భవనాలలో విద్యార్థులు వుండడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### పొన్నూరులో...

పొన్నూరుటౌన్, చేబ్రోలు, ఆగస్టు31: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షంతో జనజీవనం అతలాకుతలంగా మారింది. పొన్నూరు చేబ్రోలు మండలాల్లో భారీ వర్షం ముంచెత్తింది. అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఈదురుగాలులు, ఏకదాటిగా వర్షం కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాల్వలను తలపిస్తున్నాయి. పొన్నూరు పట్టణంలోని జీబీసీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ జలమయం అయ్యాయి. మండల పరిధిలోని పలు గ్రామాలో భారీ వర్షానికి వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పల్లపు ప్రాంతాలోని గృహాల్లోకి వాననీరు చేరి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. శలపాడులోని రామలింగేశ్వరస్వామి ఆలయం, అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు చేరింది. పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో వరి పైరు నీట మునిగే పరస్థితులు ఏర్పడాయి. ఖరీఫ్‌లో వరి సాగు ప్రారంభమై 30 రోజులు అవుతుంది. ప్రస్తుతం వరిపైరు పిలకల దశలో ఉంది. శనివారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది.

● పెదకాకాని: పెదకాకాని మండలం జగదిగ్బంధంలో చిక్కుకుంది. మండలంలోని అనేక గ్రామాల్లో చెరువులు తెగిపోయాయి. పెదకాకాని గ్రామానికి చెందిన మూడు చెరువులు తెగిపోయాయి. గుంటూరు ఛానల్‌కు పలుచోట్ల గండి పడింది. నంబూరు, గోళ్లమూడి, పెదకాకాని గ్రామాల వద్ద గుంటూరు చానల్‌పై గండ్లు ఏర్పడి వరదనీరు భారీగా పంటపొలాల మీదకు, రోడ్లమీదకు వచ్చింది. పెదకాకానిలోని సుందరయ్య కాలనీ నీట మునిగింది. నంబూరు, ఉప్పలపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లోని అనేక కాలనీల్లో వర్షపు నీరు చేరింది.



### భక్తి శ్రద్ధలతో పుష్పయాగం

పొన్నూరు టౌన్, ఆగస్టు 31: పట్టణంలోని స్వర్ణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా శనివారం స్వామివారి పుష్పయాగం భక్తిశ్రద్ధలతో జరిగింది. శ్రీవీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుతీరిన శ్రీదేవి, భూదేవి సమేత స్వర్ణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం కన్నుల పండుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు లింగమల్లు మోహన రఘుకుమార్, స్వర్ణలత దంపతులతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### పాత కక్షలతో ఒకరిపై దాడి

తెనాలి, మారీసుపేట ఆగస్టు 31: పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై దాడిచేసి గాయపరిచిన ఘటన పట్టణంలో జరిగిందని పోలీసులు తెలిపారు. శనివారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూరు మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన గుండాల మనోజ్ శుక్రవారం రాత్రి గుంటూరులోని తన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యనికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా సుల్తానాబాదు వద్ద నలకుర్తి సునీల్ అనేవ్యక్తి తన మిత్రులతో కలసి మనోజ్‌ను అడ్డగించి కర్రలతో దాడి చేసి గాయపర్చాడు. తలకు తీవ్రగాయం కావడంతో స్థానికులు జిల్లా వైద్యశాలకు తరలించగా వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

### రైల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

తెనాలి, ఆగస్టు 31: రైళ్ళలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే ఎస్సై జి.వెంకట్రాది తెలిపారు. స్థానిక యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గాజుల సురేష్ శనివారం ఐదో నెంబరు ప్లాట్‌ఫారంపై ఉన్న స్టాల్స్ వద్ద అనుమానాస్పదంగా తిరగడంతో అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో నిందితుడు ప్రయాణికుల నుంచి నగదు, విలువైన వస్తువులు అపహరించినట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది మార్చి 26న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వై.ఉషాకుమారి అనే ప్రయాణికురాల బ్యాగ్ నుంచి రూ.5వేల నగదు, హెల్త్‌కార్డు, వీసా, డెబిట్ కార్డులు అపహరించాడు. ఈ నెల 25న గుడివాడ రైల్వేస్టేషన్ పరిధిలోని లింగంపల్లి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దొంగతనం కేసులో ఇతడు ఒక ప్రయాణికుడి నుంచి పాస్‌పోర్టు, ల్యాప్‌ట్యాప్, ఏటీఎం కార్డు, డెబిట్ కార్డులను దొంగిలించినట్లు గుర్తించామన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయురాలు గోగినేని సుమతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

### ప్రధానోపాధ్యాయురాలు సుమతి సేవలు వెలకట్టలేనివి

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఆగస్టు 31: ఉపాధ్యాయ వృతిలో రాణించిన ప్రధానోపాధ్యాయురాలు గోగినేని సుమతి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ కొనియాడారు. మండలంలోని మాచవరం జడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన సుమతి శనివారం పదవీ విరమణ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరై గోగినేని సుమతి, వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఎం సుమతి నాలుగు దశాబ్దాలుగా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.